

24, 25న సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తుల పర్యటన

ప్రజాశక్తి-విజయనగరం లీగల్

సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పమిడిఘంటం శ్రీనరసింహ, రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ సహా పలువురు హైకోర్టు న్యాయమూర్తులు ఈనెల 24, 25 తేదీల్లో జిల్లాలో పర్యటించనున్నారు. వారితో పాటు రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ యు.దుర్గాప్రసాదరావు, జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు కూడా జిల్లాలో పర్యటిస్తున్నట్టు జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కళ్యాణ్ చక్రవర్తి తెలిపారు. ఈనెల 24న న్యాయమూర్తులు బొబ్బిలిలో రూ.40 కోట్ల వ్యయంతో నిర్మించనున్న నాలుగు కోర్టు భవనాల సముదాయానికి శంకుస్థాపన చేయనున్నట్టు తెలిపారు. అనంతరం 4గంటలకు వేణుగోపాలస్వామి ఆలయాన్ని న్యాయమూర్తులు దర్శిస్తారని వెల్లడించారు. సాయంత్రానికి విజయనగరం చేరుకుంటారు. 25న విజయనగరంలో రూ.99.2 కోట్లతో నిర్మించనున్న జిల్లా కోర్టు భవనాల సముదాయానికి శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం బార్ అసోసియేషన్ సభ్యులను ఉద్దేశించి మాట్లాడనున్నారు. మధ్యాహ్నం 1గంటకు విజయనగరం నుంచి బయలుదేరి విశాఖ చేరుకుంటారు.



విద్యార్థులకు పరీక్షా కాలం మొదలైంది. ఎక్కడ చూసినా విద్యార్థులు పుస్తకాలకే పరిమితమవుతున్నారు. పది, ఇంటర్ విద్యార్థులు పరీక్షలకు సిద్ధమవుతున్నారు. విద్యార్థులను సన్నద్ధం చేసే దిశగా ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. జిల్లాలో పది, ఇంటర్ పరీక్షల్లో ముందంజలో నిలిచే దిశగా అధికారులు కసరత్తు ప్రారంభించారు. జిల్లాలో ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు ఈనెల 11 నుంచి జరుగుతున్నాయి. అయితే ఈ పరీక్షలు మొక్కుబడిగా జరుగుతున్నాయనే విమర్శలున్నాయి. ఇంటర్ బోర్డు ఆదేశాల మేరకు పరీక్ష కేంద్రాల్లోకి గంట ముందు మాత్రమే విద్యార్థులను అనుమతిస్తారు. ఇంటర్ ప్రాక్టికల్స్ రెండు విడతల్లో నిర్వహిస్తారు.

పరీక్షా కాలం

- మార్చి 1 నుంచి ఇంటర్,18 నుంచి పదో తరగతి పరీక్షలు
- విద్యార్థులను సన్నద్ధం చేస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మొదటి విడత ప్రాక్టికల్ పరీక్షలు ఈనెల 11వ తేదీ నుంచి 15 వరకు, రెండో విడత 16వ తేదీ నుంచి 20వ తేదీ వరకు జరిగాయి. మార్చి 1వ తేదీ నుంచి థియరీ పబ్లిక్ పరీక్షలు నిర్వహిస్తారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. ఈ ఏడాది ఇంటర్ పరీక్షలకు మొదటి సంవత్సరం విద్యార్థులు 20,630 మంది పరీక్ష రాయనున్నారు. మొత్తం విద్యార్థుల్లో జనరల్ -17,031 మంది, ఒకేషనల్ - 3599 మంది ఉన్నారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మొత్తం 25,134 మంది హాజరు కానున్నారు. వీరిలో జనరల్ విద్యార్థులు 20,896, ఒకేషనల్ విద్యార్థులు 4238 మంది ఉన్నారు.

టెన్త్ పరీక్షలకు కూడా అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. సుమారు 30వేల మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉండగా, విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా యంత్రాంగం ప్రత్యేక దృష్టి పెట్టింది. కేంద్రాల వద్ద వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచుతుంది. ఉదయం 9.30 గంటల నుంచి 12.45 గంటల వరకు పరీక్షలు జరగనుండగా, నిమిషం ఆలస్యమైనా అనుమతి ఇవ్వరు. సమస్యాత్మక కేంద్రాలతో పాటు సిట్టింగ్ స్క్వాడ్ ఏర్పాటు చేయనున్నారు. అలాగే ఓపెన్ పరీక్షల నిర్వహణ మార్చి ఒకటి నుంచి 19వ తేదీ వరకు జరుగుతుంది. వేసవి నేపథ్యంలో ప్రతి పరీక్ష కేంద్రం వద్ద వైద్యులు అందుబాటులో ఉండేటట్టు చూడాలని కలెక్టర్ సూచించారు.

పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు

మంత్రి బొత్స సత్యనారాయణ



ప్రజాశక్తి-విజయనగరం

పదోతరగతి, ఇంటర్ తదితర పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు చేసి, పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఆదేశించారు. తాడేపల్లిలోని విద్యా శాఖ కార్యాలయం నుంచి ఇంటర్మీడియట్, 10వ తరగతి, డిఎస్సి, టెట్ పరీక్షలపై జిల్లా కలెక్టర్లు, స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ సురేష్ కుమార్, ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ కమిషనర్ సౌరబ్ గౌర్, విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ తో కలిసి మంత్రి బొత్స గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్నది పరీక్షల కాలమని, అధికారులంతా అప్రమత్తంగా విధులను నిర్వహించాలని ఆదేశించారు. మార్చి 1 నుంచి 20 వరకు ఇంటర్ పరీక్షలు, మార్చి 18 నుంచి నిర్వహించే పదవ తరగతి పరీక్షల కోసం ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ నెల 27 నుంచి టెట్, మార్చి 15 నుంచి డిఎస్సి జరుగుతాయని చెప్పారు. విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయించే ఈ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సూచించారు. మరోవైపు ఎన్నికల ప్రక్రియ కూడా ప్రారంభం కాబోతుందని, దీనిని దృష్టిలో పెట్టుకుని ఏర్పాట్లు చేయాలన్నారు. పరీక్షలను సజావుగా నిర్వహించడంతో పాటు, స్పాట్ వేల్యుయేషన్ కు కూడా కలెక్టర్లు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. వివిధ శాఖల రాష్ట్ర ఉన్నతాధికారులు మాట్లాడుతూ ఫ్లయింగ్ స్క్వాడ్స్ ఏర్పాటు చేసి పరీక్షలను తనిఖీ చేయనున్నారు. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి బందోబస్తు ఏర్పాటు చేయాలని, పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ ఏర్పాటు చేయాలన్నారు. మాస్ కాపీయింగ్ జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాలను సెల్ ఫోన్ ఫ్రీ జోన్ గా ప్రకటించడం జరిగిందని, సిబ్బంది కూడా సెల్ఫోన్లు ఉపయోగించరాదని స్పష్టం చేశారు. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకొనే విధంగా బస్సులను ఏర్పాటు చేయాలని, హాల్ టిక్కెట్ చూపిస్తే ఉచిత ప్రయాణానికి అనుమతించాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా నుంచి కలెక్టర్ నాగలక్ష్మి, డిఇఒ ఎన్.ప్రేమ్‌కుమార్, డివిఇఒ భీమశంకర్, ఆర్ఐఒ మజ్జి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఎపి రైతుసంఘం నాయకులు, రైతులు

రైతులకు మద్దతుగా నిరసన

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

ఢిల్లీలో రైతులు చేస్తున్న పోరాటానికి మద్దతుగా ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.గోపాలం ఆధ్వర్యాన గురువారం మండలంలోని రంగరాయపురంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా గోపాలం మాట్లాడుతూ చలో ఢిల్లీ కార్యక్రమంలో రైతులపై రబ్బరు బుల్లెట్లతో దాడి, లాఠీఛార్జిని తీవ్రంగా ఖండించారు. యువరైతును మోడీ ప్రభుత్వం పొట్టన పెట్టుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిజెపి ప్రభుత్వం దేశంలో అదాని, అంబానీకి వ్యవసాయాన్ని కట్టబెట్టాలనే కుట్ర చేస్తోందని ధ్వజమెత్తారు. వచ్చే ఎన్నికల్లో మోడీకి గుణపాఠం తప్పదని హెచ్చరించారు. మోడీ పంచన చేరే పార్టీలను ఓడించాలని కోరారు. రైతులను దగా చేస్తున్న ఏ ప్రభుత్వమైనా మట్టిలో కలిసిపోతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతు సంఘం నాయకులు ప్రసాద్, భూషణం, సాంబయ్య, సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకర్రావు రైతులు పాల్గొన్నారు.

మీడియాపై దాడులు సరికాదు

ప్రజాశక్తి-చీపురుపల్లి

తమ విధులను నిర్వహిస్తూ సమాజంలో జరుగుతున్న సంఘటనలను నిక్కచ్చిగా ప్రజలకు తెలియజేస్తున్న మీడియాపై దాడులు చేయడం వైసిపికి తగదని మాజీ ఎంఎల్ఎ గద్దే బాబూరావు పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఆయనొక ప్రకటన విడుదల చేసారు. ఓటమి భయంతోనే వైసిపి నాయకులు దాడులు చేస్తున్నారని, ఇది సమాజానికి గొడ్డలి పెట్టులాంటిందని పేర్కొన్నారు. ఇటీవల రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫొటో గ్రాఫర్‌పై జరిగిన దాడిగాని, కర్నూలు లో ఈనాడు కార్యాలయంపై జరిగిన దాడిని ఆయన ఖండించారు. వైసిపి చేసిన అవినీతిని బయటకు తీస్తున్న మీడియాపై దాడులు చేయడం మంచి పద్ధతి కాదని తెలిపారు.

దాడి చేసిన వారిని శిక్షించాలి

విజయనగరం టౌన్ : ప్రజలకు జరుగుతున్న అన్యాయాలు, దోపిడీలపై వార్తలు రాస్తున్న జర్నలిస్టులపై దాడులు చేయడం అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని అవమానించడమేనని గో.సంరక్షణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు లోగిశ రామకృష్ణ అన్నారు. నిందితులను శిక్షించాలని గురువారం కలెక్టరేట్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి వినతి అందజేసి నిరసన తెలిపారు. ఇటువంటి భౌతిక దాడులు చేస్తున్న వారి పై కేసులు నమోదు చేసి రౌడీ షీట్లు నమోదు చెయ్యాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గో.సంరక్షణ సమాక్య రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కేదారిశెట్టి సత్యనారాయణ, మహిళా అధ్యక్షురాలు చోళ్ల రాజకుమారి, పట్టణ అధ్యక్షులు మద్దెల సోంబాబు, ఉపాధ్యకులు ఉప్పాడ పైడితల్లి తదితరులు పాల్గొన్నారు.

వైసిపిలోకి వరహాలునాయుడు

- 26న ముహూర్తం ఖరారు
- మంత్రి బొత్స సమక్షంలో చేరేందుకు సన్నాహాలు



ప్రజాశక్తి-చీపురుపల్లి

జెడ్పిటిసి మాజీ సభ్యులు మీసాల వరహాలనాయుడు వైసిపి పార్టీలోకి వెల్లేందుకు నిర్ణయించుకున్నారు. ఈ మేరకు చీపురుపల్లి పంచాయతీ పరిధిలో తన వర్గంతో ఈనెల 21న సమావేశం ఏర్పాటు చేసిన వరహాలునాయుడు మంత్రి బొత్స సమక్షంలో వైసిపి తీర్థం పుచ్చుకునేందుకు అందరం సమాయత్తం కావాలని తన గ్రూపు నాయకులకు చెప్పినట్లు తెలిసింది. ఈనెల 26న స్థానిక మూడు రోడ్లు కూడలి వద్ద ఏర్పాటు చేయనున్న సభలో రాష్ట్ర మంత్రి బొత్స సత్యన్నారాయణ సమంక్షంలో పెద్ద ఎత్తున కార్యకర్తలతో చేరేందుకు నిర్ణయించుకున్నారు. రాజకీయాలు తెలిసినప్పటి నుండి వరహాలనాయుడు బెల్లాన సింహాచలంతో కలసి పని చేసారు. అనంతరం ప్రస్తుత ఎంపి బెల్లాన చంద్రశేఖర్‌కు కుడిభుజంగా ఉంటూ మీసాల వరహాలనాయుడు బెల్లాన కుటుంబం పోటీ చేసినప్పుడల్లా తానే అన్ని అయి చూసుకునే వారు. అనంతరం బొత్స సత్యన్నారాయణ ఎన్నికలలో పోటీ చేసేటప్పుడు బెల్లాన చంద్రశేఖర్, మీసాల వరహాలనాయుడులు బొత్స గెలుపునకు కృషి చేసారు. ఈ క్రమంలో 2012లో రామలింగాపురం సొసైటీ అధ్యక్ష ఎన్నికలు జరిగినప్పుడు నల్లా నాగేశ్వరరావుకు సొసైటీ అధ్యక్ష పదవి ఇవ్వాలని వరహాలనాయుడు, బెల్లాన త్రినాధ్‌కు ఇవ్వాలని బెల్లాన చంద్రశేఖర్‌లు పట్టుబడడంతో వరహాలనాయుడుకు, బెల్లాన చంద్రశేఖర్‌కు మధ్య విబేధాలు మొదలయ్యాయి. దీంతో వీరిద్దరూ ఎడమొహం పెడమొహంతో బొత్స సత్యన్నారాయణకు తలనొప్పిగా తయారయ్యారు. ఈనేపథ్యంలో వరహాలనాయుడు ఏ పనికెల్లినా బెల్లాన చంద్రశేఖర్ అడ్డు వస్తున్నారనే నెపంతో 2013లో చీపురుపల్లి మేజర్ పంచాయతీకి ఇండిపెండెంట్‌గా తన సతీమణి మీసాల సరోజినిని సర్పంచ్ అభ్యర్థిగా నిలబెట్టి సుమారు 5 వేల 750 ఓట్లు మెజారిటీతో గెలిపించుకున్నారు. 20 వార్డులకు గాను 18 వార్డు మెంబర్లను వరహాలనాయుడు గెలుచుకున్నాడు. 2014లో మీసాల వరహాలనాయుడు తెలుగుదేశం పార్టీలో తన అనుచర గణంతో చేరారు. ఆ పార్టీ తరుపున జడ్పిటిసిగా పోటీ చేసిన వరహాలనాయుడు సుమారు 7 వేల ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. అయితే ఆ పార్టీలో ఎంతో కాలం నిలవలేక నాయకులతో విబేధాలు వచ్చి పార్టీకి అంటి ముట్టనట్టుగానే వ్యవహరిస్తూ వచ్చారు. టిడిపి కూడా వరహాలనాయుడును పట్టించుకోకపోవడంతో తిరిగి మంత్రి బొత్స సత్యనారాయణ సమక్షంలో తన అనుచర గణంతో వైసిపిలో చేరేందుకు సిద్ధమయ్యారు.

22వ రోజుకు మిమ్స్ ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మిమ్స్ ఉద్యోగులు, కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించే వరకూ ఆందోళన కొనసాగిస్తామని మిమ్స్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు టి.వి.రమణ హెచ్చరించారు. మిమ్స్ ఉద్యోగుల 22వ రోజు పోరాటం సందర్భంగా మిమ్స్ హాస్పిటల్ నుంచి రామతీర్థం జంక్షన్ వరకు గురువారం పెద్ద ఎత్తున ర్యాలీ చేసి అనంతరం అక్కడ మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా టి.వి.రమణ మాట్లాడుతూ మిమ్స్ యాజమాన్యం లేబర్ అధికారులు నిర్వహించే చర్చలకు రాకుండా కార్మిక చట్టాలను, రాజ్యాంగాన్ని ధిక్కరిస్తుందన్నారు. ఉద్యోగులను తల్లిదండ్రుల వలే చూసుకుటున్నాం అంటున్న యాజమాన్యం నేటికీ జనవరి నెల జీతం ఇవ్వకపోవడం పట్ల ఎంత ప్రేమ ఉందో అర్థమవుతుందని ఎద్దేవా చేశారు. రేపు విశాఖపట్నంలో జాయింట్ లేబర్ కమిషనర్ వద్ద జరిగే చర్చల్లో సమస్య పరిష్కారం కోసం చర్చలకు వస్తే మంచిదని, లేబర్ అధికారుల ముందు సమస్యలు పరిష్కారమవుతాయని స్పష్టం చేశారు. ముందుకు రాకపోతే గ్రామాల నుంచి కుటుంబ సభ్యులతో సహా ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు. సిటిటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ మాట్లాడుతూ యాజమాన్యం అబద్ధపు ప్రచారాలు మానుకోవాలన్నారు. ఒకవైపు కార్మికులను ఇబ్బంది పెడుతూ మరొకవైపు ప్రజలకు సరైన వైద్యం అందించకుండా, విద్యార్థులకు విద్య అందకుండా నిర్లక్ష్యం చేస్తుందన్నారు. మిమ్స్ యాజమాన్యం చట్టాన్ని దిక్కరించి 7 డిఎలు బకాయిలు ఇవ్వకపోవడం, కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయకుండా నిర్లక్ష్యం చేయడం భావ్యం కాదన్నారు. ఇప్పటికైనా మిమ్స్ యాజమాన్యం మొండి వైఖరి వీడి చర్చలకు వచ్చి ఉద్యోగులు, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కిల్లంపల్లి రామారావు, ఉద్యోగులు మిరప నారాయణ, కర్రోతు కాము నాయుడు, మహంతి నాగభూషణం, మధు, మూర్తి, రాంబాబు, గౌరీ, వరలక్ష్మి, రామకృష్ణ, బంగారునాయుడు, నాగేశ్వరరావు, రమణ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న మిమ్స్ ఉద్యోగులు, యూనియన్ నాయకులు

మైనార్టీ బోర్డులకు రూపాయైనా ఇచ్చారా?

ప్రజాశక్తి-విజయనగరం కోట

వైసిపి ప్రభుత్వం మైనార్టీలకు బోర్డులు పెట్టి ఒక్క రూపాయి అయినా ఇచ్చిందా అని టిడిపి విజయనగరం పార్లమెంట్ మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎస్కెఎం భాష,, రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ఎస్కె ఖాదర్ షా ప్రశ్నించారు. గురువారం టిడిపి కార్యాలయం అశోక్ బంగ్లాలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ కల్లబొల్లి మాటలు చెప్పి ముస్లిం ఓట్లు వేయించుకొని అధికారంలోకి వచ్చిన జగన్మోహన్ రెడ్డి తరువాత వారిని మోసం చేశారని అన్నారు. దుల్హన్ పథకం కింద చంద్రబాబు 40 వేల మందికి లబ్ధి చేకూరిస్తే జగన్మోహన్ రెడ్డి కేవలం 3600 మందికి మాత్రమే మేలు చేశారన్నారు. ఉత్తుత్తి కార్పొరేషన్ లో పెట్టి మోసం చేశారన్నారు 2017లో అశోక్ గజపతిరాజు షాది ఖానాలకు రూ.10లక్షలు ఇస్తే వాటి మరమ్మతులకు కనీసం వెయ్యి రూపాయలు కూడా వైసిపి నాయకులు ఇవ్వలేదన్నారు. చంద్రబాబు అధికారంలోకి వస్తేనే మైనార్టీలకు మేలు జరుగుతుందని అన్నారు. సమావేశంలో అక్బర్, సిద్ధిక్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న జిందాల్ భూ నిర్వాసితుల దీక్షలు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

తమకు న్యాయంగా రావాల్సిన బకాయిలు ఇవ్వాలని, తమకు పూర్తిస్థాయి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ జిందాల్ అల్యూమినా కంపెనీ భూ నిర్వాసితులు చేస్తున్న నిరసన గురువారానికి మూడో రోజుకు చేరింది, ఈ దీక్షలలో కూర్చున్న పలువురు బాధితులు మాట్లాడుతూ 2008వ సంవత్సరంలో జిందాల్ అల్యూమినా కర్మాగారం ఏర్పాటు చేస్తామంటే తమ భూములు అప్పట్లో గల ధరకు ఇచ్చామని, పరిశ్రమ ఏర్పాటు కాకముందే మీకు మా కంపెనీలో షేర్ల ద్వారా భాగస్వాములు చేస్తామని కంపెనీ నమ్మించిందని తెలిపారు. 16ఏళ్లు గడిచినా ఎటువంటి పరిశ్రమ రాని కారణంగా భూములు ఇచ్చిన పేద గిరిజనులైన తమ బతుకులు అధ్వాన్నంగా తయారై రోడ్డున పడ్డామని వాపోయారు. కార్యక్రమంలో ఎంపిపి సండి సోమేశ్వరరావు, వైసిపి నాయకుడు మురళిరాజు, పాల్గొన్నారు.



ఆర్మ్‌డ్ రిజర్వు బలగాల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్‌పి దీపిక

ముగిసిన ఖాదర్ బాబా గంధ మహోత్సవాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

హజరత్ సయ్యద్ ఖాదర్ వలీ బాబా 65వ ఉరుసు మహోత్సవాలు గురువారం ముగిశాయి. మూడు రోజుల పాటు ఘనంగా జరిగిన ఈ ఉత్సవాల్లో దేశ నలుమూలల నుంచి విచ్చేసిన భక్తులు ఖాదర్ బాబా దర్గాలో సుగంధ, చాదర్ సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సూఫీ పరంపర మహనీయులను స్మరించుకుంటూ విశ్వ శాంతి కోసం దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనేక మంది ప్రముఖులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు ఖాదర్ బాబా దర్గా, దర్బార్ షరీఫ్ కు విచ్చేసి దర్శనం చేసుకున్నారు. మూడు రోజుల పాటు నిర్విఘ్నంగా నిర్వహించిన భారీ లంగర్ ఖానాలో లక్షల మంది అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. సూఫీ పీఠాధిపతి హజరత్ ముహమ్మద్ అతావుల్లా షరీఫ్ షా తాజ్ ఖాదరీ బాబా వారి అధ్యాత్మిక వారసుడు, సజ్జాద నషీన్ ముహమ్మద్ ఖాజా మోహియుద్దీన్ షా ఖాదరి విశ్వ శాంతిని కాంక్షిస్తూ, ప్రేమ తాత్వాన్ని ప్రభోదిస్తూ భక్తులకు తమ సందేశాన్ని అందించారని దర్గా దర్బార్ ధర్మకర్త ఖలీల్ బాబు తెలిపారు.



ఊరేగింపు నిర్వహిస్తున్న ఖలీల్‌బాబు, తదితరులు

దర్గాను దర్శించుకున్న డిప్యూటీ స్పీకర్

ఖాదర్ నగర్‌లోగల ఖాదర్‌బాబా దర్గాను గురువారం డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి సందర్శించి ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్లు గాదం మురళి, మారోజు శ్రీనివాసరావు మాట్లాడుతూ పేదలకు స్వాంతన చేకూర్చేలా ఆనాడు బాబా అనేక కార్యక్రమాలు చేపట్టారన్నారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, గదుల సత్యలత, వేముల రాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

విద్యకు దూరం చేసిన జగన్

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఎస్‌సిలను విద్యకు దూరం చేసిన ఘనత జగన్మోహన్‌రెడ్డిదే అని విజయనగరం నియోకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి అదితి విజయలక్ష్మి గజపతిరాజు అన్నారు. బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా గురువారం జొన్నగుడ్డి, కోరాడ వీధి, ఎలుగుబంటి వారి వీధి, తుపాకుల వీధి ప్రాంతాలలో అవనాపు విజయ్‌తో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. చంద్రబాబు నాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలను ప్రజలకు వివరించారు, ఈ సందర్భంగా అదితి గజపతి మాట్లాడుతూ జగన్ ముఖ్యమంత్రి అయిన నాటి నుంచి బడుగు బలహీన వర్గాలను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు, ఎస్‌సిలకు ఒక్క రూపాయి రుణం ఇవ్వలేదని, బెస్ట్ అవైలబుల్ స్కూళ్లను త్రివేసి వారికి విద్యను దూరం చేసారన్నారు, ఇలా 27 పథకాలను రద్దు చేసి దళితులను మోసం చేసారని విమర్శించారు. అంతేకాకుండా దళితులకు ఈ ప్రభుత్వంలో రక్షణ కరువైందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కార్యదర్శి గంటాపోలినాయుడు, రాష్ట్ర బిసినాయకులు వేచలపు శ్రీనివాసరావు, కార్యాలయ కార్యదర్శి రాజేష్‌బాబు, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.



సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలను పంపిణీ చేస్తున్న అదితి గజపతిరాజు

ఎన్నికల నిర్వహణకు

దృఢ సంకల్పంతో పనిచేయాలి

మొబలైజేషన్ ముగింపు వేడుకల్లో ఎస్‌పి

ప్రజాశక్తి-విజయనగరం కోట

శాంతియుత ఎన్నికల నిర్వహణకు సిబ్బంది ధృడ సంకల్పంతో పని చేయాలని ఎస్‌పి ఎం.దీపిక సూచించారు. ఆర్మ్‌డ్ రిజర్వు మొబలైజేషన్ ముగింపు సందర్భంగా గురువారం పోలీసు పరేడ్ గ్రౌండ్ లో నిర్వహించిన పరేడ్‌కు ఎస్‌పి ముఖ్య అతిథిగా హాజరై గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొద్దిరోజుల్లో నిర్వహించే సార్వత్రిక ఎన్నికలను శాంతియుతంగా, స్వేచ్ఛగా, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిర్వహించేందుకు ప్రతీ ఒక్కరూ అంకిత భావంతో, పని చేయాలని, శాంతిభద్రతలకు ఎటువంటి విఘాతం కలగకుండా చూడాలని అన్నారు. ఎన్నికల సందర్భంగా వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసే చెక్ పోస్టుల్లో సిబ్బంది మరింత అప్రమత్తంగా, సమర్థవంతంగా పని చేయాలని, అక్రమ రవాణకు పాల్పడే వ్యక్తులపై కఠినంగా వ్యవహరించాలని అన్నారు. జిల్లాల పునర్విభజన తరువాత ఎన్నో సవాళ్లను ఎదుర్కొని పోలీసులు విధులు నిర్వహిస్తున్నారని, ఎంతో సంయమనంతో పని చేసి, శాంతిభద్రతలకు ఎటువంటి విఘాతం కలగకుండా సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్నారని అన్నారు. ఇదే స్ఫూర్తితో పని చేసి రాబోయే ఎన్నికల్లో కూడా పని చేయాలని పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా ఆర్మ్ రిజర్వు పోలీసుల వ్యక్తిగత, ఉద్యోగ సమస్యలు తెలుసుకొని, వాటి పరిష్కారానికి ఎస్‌పి చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి అస్మా ఫర్హీన్, ఎఆర్ డిఎస్‌పి యూనివర్స్, విజయనగరం డిఎస్‌పి ఆర్.గోవిందరావు, పలువురు రిజర్వు ఇన్‌స్పెక్టర్లు, సిఐలు, అర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - భోగాపురం

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం గురువారం సాదాసీదాగా జరిగింది. ఎంపిపి అనూషా రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఉపాధి హామీ ఎపిఒ ఆదిబాబు, ఏ రావివలస సర్పంచ్ శివారెడ్డి మధ్య ఉపాది హామీ పనులకు సంబంధించి స్వల్ప వివాదం చోటుచేసుకుంది. ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు మాట్లాడుతూ సమస్యలపై అధికారులు ఎప్పటికప్పుడు స్పందించాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండాలని తెలిపారు. ఎంపిపి ఉప్పాడ అనూష రెడ్డి వివిధ శాఖలకు చెందిన అధికారులతో సమీక్షించారు. వైసిపి మండల అధ్యక్షులు ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి, ఎంపిడిఒ చంద్రకళ, తహశీల్దార్ శ్యాం ప్రసాద్, జెడ్‌పిటిసి పడాల మంజులత, వైస్ ఎంపిపి పడాల సత్యవతి, ఎంపిటిసి, సర్పంచులు పాల్గొన్నారు.

అబాకస్‌లో ఫోర్టు సిటీ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

స్కూల్ లెవల్ లో జరిగిన అబాకస్ అండ్ మెంటల్ అర్థమెటిక్‌లో ఫోర్టు సిటీ పాఠశాల విభాగాలలో సత్తా చాటారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల చైర్మన్ కె.ఎ.పి రాజు (శివ) అభినందించారు. విద్యార్థులు చదువుతో పాటు రంగాలలో కూడా రాణించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపల్ రొయినా ఖాన్, అశోక్, నీలిమ డైరెక్టర్లు చంటి మధు పాల్గొన్నారు.


కస్పాలో స్కౌట్స్ దినోత్సవం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రపంచ స్కౌట్ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం కస్పా హైస్కూలులో ఆల్ ఫెయిత్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్కౌట్ జిల్లా కమిషనర్ ఈపు విజయ కుమార్ ,సెక్రటరీ చిన్నం నాయుడు, ఎఎస్ఒ ఎస్ నాగేశ్వర రావు, జిల్లా స్కౌట్ ఆర్గనైజింగ్ కమిషనర్ ప్రవీణ్ , జిల్లా హెడ్ క్వార్టర్ చీఫ్ కమిషనర్ ఎస్.ఎస్.దొర పాల్గొన్నారు. ఈనెల 15న చలపతి స్కూల్ లో జరిగిన సైన్స్ ఎగ్జిబిషన్‌లో పాల్గొని సేవలు అందించిన కస్పా పాఠశాల స్కౌట్ విద్యార్థులకు పాఠశాల స్కౌట్ చైర్మన్ , ప్రధానోపాధ్యాయులు శంకర రావు ఈ సందర్భంగా అభినందించారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ థింకింగ్ డే

వేపాడ : సోంపురం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో గురువారం భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ థింకింగ్ డేను హెచ్‌ఎం బిపిఎ రాజు ఆధ్వర్యాన నిర్వహించారు. ఎంఇఒ పి.బాలభాస్కరరావు బిఎస్‌జి పతాకాన్ని ఆవిష్కరించారు. స్కౌటింగ్ నైపుణ్యాలైన వైల్డ్ కుకింగ్, టెంట్, పయనీరింగ్, ఫస్ట్ ఎయిడ్ తదితర అంశాలను ప్రదర్శించారు. నూతన యూనిట్ స్కౌట్స్‌కు స్కౌట్ మాస్టర్ పి.రమేష్‌నాయుడు ఆధ్వర్యాన ప్రమాణ స్వీకారం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.


కృష్ణ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

ఏగిరెడ్డి కృష్ణ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి-తెర్లాం

మండలంలోని ఉద్దవోలు గ్రామంలో గురువారం ఏగిరెడ్డి కృష్ణ మాస్టర్ విగ్రహాన్ని కుటుంబ సభ్యులు, గ్రామ నాయకులు ఆవిష్కరించారు. కృష్ణ విగ్రహానికి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాస్టర్ సేవలను కీర్తిస్తూ ఆయన కుటుంబానికి భరోసా కల్పించారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబీనాయన.. కృష్ణ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ఎంఇఒ త్రినాథరావు, యుటిఎఫ్ నాయకులు, జెడ్‌పిటిసి ప్రతినిధి జి.రామారావు, సర్పంచ్ వెంకట్రావు, టిడిపి మండల అధ్యక్షులు వెంకటనాయుడు, ఎ.సురేష్, యుగంధర్ హాజరయ్యారు. ఇందులో భాగంగా గ్రామంలో శాంతిభద్రతల దృష్ట్యా బొబ్బిలి సిఐ తిరుమలరావు ఆధ్వర్యంలో ఎస్ఐ రమేష్, సిబ్బంది బందోబస్తు ఏర్పాటుచేశారు.

గ్రూప్-2 అభ్యర్థులకు మాక్ టెస్టు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్స్‌కు సిద్ధమవుతోన్న అభ్యర్థులకు ఆన్‌లైన్ మాక్ టెస్ట్ అందుబాటులోకి తీసుకు వచ్చామని ధీరా అధినేత డాక్టర్ బొత్స సందీప్ తెలిపారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈ నెల 6వ తేదీ నుండి గ్రూప్-2 అభ్యర్థులకు మాక్ టెస్ట్ నిర్వహిస్తామన్న ప్రకటనపై వందలాది అభ్యర్థులు ఆన్లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్నారని వారందరికీ ఆన్లైన్ మాక్ టెస్ట్ పేపర్లు విడుదల చేశామని అన్నారు. ఆన్లైన్ స్టడీ మెటీరియల్‌ను ఉచితంగా అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు. ఈ నెల 25వ తేదీన పరీక్ష జరగనుండటంతో అభ్యర్థులకు సమయభావం కాకుండా ఈ నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు. ఎగ్జామినేషన్ పేపర్‌లతో పాటు కీను కూడా అందుబాటులో ఉంచామన్నారు. గ్రూప్స్ సబ్జెక్ట్ లతో కూడిన వీడియో క్లాసెస్, స్టడీ మెటీరియల్ పీడిఎఫ్ ఫార్మాట్ లో ఉచితంగా ఉంచామని చెప్పారు.

ఆదినారాయణకు అభినందన

నెల్లిమర్ల : ఖేలో ఇండియా యూనివర్శిటీ గేమ్స్ వెయిట్ లిఫ్టింగ్ విభాగంలో సెంచూరియన్ విశ్వవిద్యాలయం బిబిఎ విద్యార్థి బట్టు ఆదినారాయణకు కాంస్య పతకం లభించడం పట్ల ఛాన్సలర్ ప్రొఫెసర్ జిఎస్ఎన్ రాజు, వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంత కుమార్ మహంతి, రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్.ఎస్.వర్మ, అసిస్టెంట్ స్పోర్ట్స్ డైరెక్టర్ డి.నారాయణరావు తదితరులు గురువారం అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కోచ్ అర్జున్‌ను కూడా వైస్ చాన్సలర్ తదితరులు అభినందించారు.

వాలంటీర్ పోస్టులకు దరఖాస్తులు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

స్థానిక నగర పంచాయతీలో ఖాళీ వార్డు వాలంటీర్ పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు కమిషనర్ పి. బాలాజీ ప్రసాద్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నగర పంచాయతీలో 8 వార్డు వాలంటీర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని వాటికి నోటిఫికేషన్ జారీ చేశామని వెల్లడించారు. వీటిలో జరజాపు పేట 1, మొయిద జంక్షన్ 1, అగురు వీధి 3, ఇందిరా కాలనీ 1, గాంధీ నగర్ కాలనీ 2 ఆయా సచివాలయాల పరిధిలో మొత్తం 8 ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. ఈ నెల 23 నుంచి 26లోగా దరఖాస్తు చేసుకోవాలని, ఇంటర్వ్యూలు ఈ నెల 29న జరిపి వచ్చే నెల 1న నియామకం జరుగుతుందని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

హోరాహోరీగా గుర్రపు పోటీలు

వేపాడ : మండలంలోని కెజిపూడి గ్రామంలో బంగారమ్మ తల్లి జాతర సందర్భంగా నిర్వహించిన గుర్రపు పరుగు పోటీలు హోరాహోరీగా సాగాయి. విజేతలకు ఉత్సవ కమిటీ సభ్యులు నగదు బహుమతులు అందజేశారు. జాతర నేపథ్యంలో చిడతల బృందం ప్రదర్శన, డ్యాన్స్ బేబీ డ్యాన్స్, బాలనాగమ్మ బుర్రకథ ఏర్పాటు చేశారు.

సంక్షేమ సారథులు వాలంటీర్లే

ప్రజాశక్తి-రామభద్రపురం

సంక్షేమ సారథులు వాలంటీర్లేనని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు కితాబిచ్చారు. గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ప్రాంగణంలో వాలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు నేరుగా సుపరిపాలన అందించడానికి సిఎం సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేశారని తెలిపారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చిన ముఖ్యమంత్రి జగన్ ఒక్కరేనని అన్నారు. గత ప్రభుత్వం జన్మభూమి కమిటీలు పేరిట నియమించిన దళారీ వ్యవస్థను నిర్మూలించడానికి, సంక్షేమ పథకాలు అమలు చేయడానికి వాలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వాలంటీర్ల సేవల వల్లే ప్రజల్లో మంచి గుర్తింపు లభించిందన్నారు. అందుకే వాలంటీర్లని ప్రోత్సహించడానికి పురస్కారాలు అందిస్తున్నట్లు తెలిపారు. మండల పరిధిలోని సుమారు 45 లక్షల రూపాయలు నగదును బహుమతిగా అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఈశ్వరమ్మ, జెడ్‌పిటిసి అప్పికొండ సరస్వతమ్మ, తహాశీల్దార్ సులోచనరాణి, తదితరులు పాల్గొన్నారు.


రామభద్రపురం సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి వెంకటచినప్పలనాయుడు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

బొండపల్లి : వాలంటీర్ వ్యవస్థ వల్ల అర్హులందరికీ సంక్షేమ పథకాలు చేరుతున్నాయని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య తెలిపారు. గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ఆవరణంలో ఎంపిపి చల్ల చలంనాయుడు అధ్యక్షతన వాలంటీర్లకు సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలలో హామీ ఇచ్చిన మేరకు అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి పాలన అందిస్తున్నామన్నారు. ఎటువంటి అవినీతి అక్రమాలకూ తావు లేకుండా ధైర్యంగా గడపగడపకు పథకాలను అందించే ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని తెలిపారు. అప్పులు చేసి పథకాలను అందిస్తున్నారని టిడిపి నాయకులు ఆరోపిస్తున్నారని, ఆ పార్టీ అధికారంలోకి వస్తే అప్పులు తేకుండా సంక్షేమ పథకాలు అందించగలరా? అని ప్రశ్నించారు. ఇటీవల కొంతమంది టిడిపి నాయకులు భూదందాలు చేసినట్లు తనపై ఆరోపణలు చేస్తున్నారని, వాటిని నిరూపించగలరా? అని ఎమ్మెల్యే బొత్స సవాల్ చేశారు. సమావేశంలో ఎఎంసి చైర్మెన్ వేమలి ముత్యాలు నాయుడు, జెడ్‌పిటిసి రాపాక సూర్యప్రకాశరావు, వైసిపి మండల అధ్యక్షులు బొద్దల చిన్నంనాయుడు, పిఎసిఎస్ అధ్యక్షులు మహంతి రమణ, ఎంపిడిఒ హరిహరరావు, తదితరులు పాల్గొన్నారు.


బొండపల్లి సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య

ఎన్నికల్లో వాలంటీర్లు చొరవచూపాలి

గంట్యాడ : వాలంటీర్లు వారికి కేటాయించి 50 కుటుంబాలకు రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి గురించి వివరించి, రానున్న ఎన్నికల్లో ఓట్లు వేయించేందుకు చొరవ చూపాలని ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య అన్నారు. గురువారం కొండతామరపల్లి జంక్షన్‌లోని బాలాజీ కళ్యాణ మండపంలో జరిగిన వాలంటీర్ల సేవా పురస్కారాల ప్రదాన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌సి పి. సురేష్ బాబు, ఎంపిపి పీరుబండి హైమావతి, జెడ్‌పిటిసి సభ్యులు వర్రి నర్సింహమూర్తి, ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షులు పీరుబండి జైహింద్ కుమార్, తహాశీల్దార్ నీలకంఠేశ్వర్ రెడ్డి, ఎంపిడిఒ భవాని, వైసిపి మండల అధ్యక్షులు రంది రామనాయుడు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు

వారధులు వాలంటీర్లే : ఎమ్మెల్సీ

ప్రజాశక్తి- రేగిడి

ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారదులు వాలంటీర్లేనని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, రాజాం నియోజకవర్గం వైసిపి ఇన్చార్జ్ తలే రాజేష్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో వాలంటీర్లుకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా వాలంటీర్లు వ్యవస్థ ఆంధ్రప్రదేశ్‌లో ఉందన్నారు. వీరి ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైసిపి దేనని అన్నారు. ఈ సందర్భంగా సేవ వజ్ర 2, సేవ మిత్ర 378, సేవరత్న 5 మంది వాలంటీర్లకు అవార్డులు ప్రదానం చేశారు. ఈ సభలో వైస్ ఎంపిపిలు టంకాల అచ్చెంనాయుడు, వావిలాపల్లి జగన్‌మోహన్‌రావు, జెసిఎస్ మండల కన్వీనర్ కింజరాపు సురేష్, వైసిపి నాయకులు ముయిద శ్రీనివాసరావు, కెంబూరు వెంకటేశ్వరరావు, సవలాపూర్ రమేష్ కుమార్, కెంబూరు గోవిందరావు, వియ్యపు చక్రపాణి, చంద్రశేఖర్, ఎంపిడిఒ శ్యామల కుమారి, వంగర ఎంపిపి సురేష్ ముఖర్జీ, జెడ్‌పిటిసి కరణం సుదర్శన్ రావు, సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

ప్రోత్సాహం అందలేదని వాలంటీర్ల ఫిర్యాదు


తలేరాజేష్‌కు ఫిర్యాదు చేస్తున్న వాలంటీర్లు

రెండేళ్లగా సేవా మిత్రలకు అందని ప్రోత్సాహకం

రెండేళ్ల క్రితం ప్రకటించిన ప్రోత్సాహం తమకు ఇంతవరకు అందలేదని లింగాలవలసలో ఇద్దరు వాలంటీర్లు రాజాం నియోజకవర్గం వైసిపి ఇంచార్జి తలే రాజేష్‌కు గురువారం సన్మాన సభలో ఫిర్యాదు చేశారు. గ్రామంలో బొట్ట కృష్ణకుమారి, లావేటి శివజ్యోతి వాలంటీర్లుగా ఉత్తమ సేవలు అందించినట్లు గుర్తించి రెండేళ్లుగా సేవా మిత్ర అవార్డు లభించినప్పటికీ ఇంతవరకు నగదు ప్రోత్సాహకం రూ.15వేలు ప్రభుత్వం నుంచి అందలేదని మొరపెట్టుకున్నారు. వీటిపై స్పందించిన ఇన్చార్జి రాజేష్ ఎంపిడిఒ శ్యామల కుమారికి ఈ విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. సేవ మిత్ర అవార్డు వచ్చినప్పటికీ నగదు ప్రోత్సాహకం అందకపోవడం ఏమిటని ప్రశ్నించారు. తక్షణమే నివేదికలు ఇవ్వాలన్నారు. జిల్లా ఉన్నతాధికారులతో మాట్లాడి సేవా మిత్రా నగదు వచ్చేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

సచివాలయ భవనం ప్రారంభం

ప్రజాశక్తి-కొత్తవలస

కొత్తవలస మేజర్ పంచాయతీ పరిధిలోని రాజపాత్రునిపాలెం గ్రామంలో రూ.43.60 లక్షల వ్యయంతో నిర్మించిన సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ స్థాయిలో సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి ప్రజా సంక్షేమం, గ్రామాల అభివృద్ధికి శ్రీకారం చుట్టిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని కొనియాడారు. అనంతరం పంచాయతీ పరిధిలోని వాలంటీర్లతో ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి కర్రి శ్రీను, సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి పాల్గొన్నారు.


సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

వాలంటీర్ల సేవలు వెలకట్టలేనివి

గ్రామ వాలంటీర్లు అందిస్తున్న సేవలు వెల కట్టలేనివని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద వాలంటీర్లకు సన్మానాలు చేశారు. ఈ సందర్భంగా గ్రామ వాలంటీర్లకు పురస్కారాలు అందించారు. కార్యక్రమంలో ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ, జెడ్‌పిటిసి నెక్కల శ్రీదేవి, పిఎసిఎస్ అధ్యక్షులు గొరపల్లి శివ, తహశీల్దార్ సిహెచ్ చంద్రశేఖరరావు, ఎంపిడిఒ ఎస్.రమణయ్య, సిఎస్ డిటి టి.రమేష్, ఇఒ సి.హెచ్.కన్నబాబు, విఆర్ఒ సుధీర్, వైసిపి మండల అధ్యక్షులు ఒబ్బిన నాయుడు, తుమ్మికాపల్లి సర్పంచ్ విరోతి కొండలరావు, కంటకాపల్లి సర్పంచ్ మదిన అప్పలరాం, జెసిఎస్ మండల ఇన్‌ఛార్జి బొంతల వెంకటరావు, బంగారు శ్రీను పాల్గొన్నారు.

ప్రభుత్వం అండగా ఉంటుంది : ఎమ్మెల్సీ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

బాధిత కుటుంబాలకు వైసిపి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్సీ డాక్టర్ సురేష్ బాబు అన్నారు. సతివాడ గ్రామానికి చెందిన నూతలపాటి సురేష్ భవన నిర్మాణ కార్మికులుగా పని చేస్తూ ప్రమాదానికి గురై ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నారు. ఈ నేపథ్యంలో చికిత్సకు సంబంధించి వైద్య ఖర్చుల వివరాలను సిఎం సహాయ నిధినుంచి ఎమ్మెల్సీ అందించారు. దీంతో రూ.60 వేలు సహాయం మంజూరైంది. ఈ చెక్కును బాధితుడికి గురువారం అందించారు. ఆరోగ్య శ్రీ పరిధిలో లేని వ్యాధుల చికిత్స మొత్తాన్ని కూడా ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరు చేసి పేదలను ఆర్థికంగా సిఎం ఆదుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రేవళ్ల శ్రీను, ఎంపిటిసి సత్యనారాయణ, వైఎస్ఆర్ ట్రేడ్‌యూనియన్ నాయకులు ధవళ లక్ష్మణరావు, నాయకులు ఎం లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

సురక్షిత తాగునీరు అందించేందుకు చర్యలు

ప్రజాశక్తి-బొబ్బిలి

పట్టణ ప్రజలకు సురక్షితమైన తాగునీరు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ డిఇ కనకరాజు చెప్పారు. చీపురుపల్లివీధిలో గురువారం తాగునీటి నాణ్యతను పరీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న వేసవిలో నీటిఎద్దడి నివారణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆయనతో మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

అక్రమ మద్యం పట్టివేత

ప్రజాశక్తి-గంట్యాడ

మండలంలోని నరవ జంక్షన్‌లో గంట్యాడ పోలీసులు 19 మద్యం సీసాలను పట్టుకున్నారు. కింతాడ అప్పన్న అక్రమంగా గుంకలాం గ్రామానికి మద్యం తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్ఐ సురేంద్రనాయుడు తెలిపారు. అప్పన్నపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.


పల్స్‌పోలియోపై ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ఎఎన్ఎంలు, ఆశావర్కర్లు

పల్స్‌పోలియోపై శిక్షణ

ప్రజాశక్తి- వేపాడ

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో గురువారం పల్స్ పోలియో కార్యక్రమంపై సిబ్బందికి ఎంపిడిఒ జి.ఉమ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. వచ్చే నెల మూడో తేది నుంచి మూడురోజుల పాటు జరిగే పల్స్‌పోలియో కార్యక్రమానికి ఏర్పాట్లు సిద్ధం చేసుకోవాలని ఎంపిడిఒ సూచించారు. ఐదేళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యాధికారి ఎ.ధరణి, సిహెచ్ఒ ఆంజనేయులు, సిబ్బంది వెంకటరావు సత్యనారాయణ, కోఆర్డినేటర్ రాంబాబు పాల్గొన్నారు.

అనంతరం పిహెచ్‌సి వైద్యాధికారి ధరణి ఆధ్వర్యాన పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిబ్బంది, అంగన్వాడీ, ఆశావర్కర్లు వాల్‌పోస్టర్లను ప్రదర్శించారు.

నేడు కలెక్టరేట్ ప్రాంతానికి విద్యుత్తు అంతరాయం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కలెక్టరేట్ ప్రాంతానికి శుక్రవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్తు అంతరాయం ఉంటుందని విద్యుత్తుశాఖ ఇఇ పి.హరి ఒ ప్రకటనలో తెలిపారు. 33/11 కెవి కలెక్టరేట్ సబ్ స్టేషన్ లో కనపాక ఫీడర్ మీద ఉన్న చెట్ల కొమ్మలను తొలగించే క్రమంలో విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. కణపాక, కామాక్షినగర్. ఖాళీఘాట్ కాలనీ, వుడా ఫేస్ `1 ప్రాంతాలకు విద్యుత్ ను నిలుపుదల చేయ నున్నట్లు పేర్కొన్నారు.

మౌలిక సౌకర్యాలు కల్పించాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

గ్రోత్ సెంటర్లో మౌలిక సౌకర్యాలు కల్పించాలని లోక్‌సత్తా జిల్లా అధ్యక్షులు ఆకుల దామోదర్ డిమాండ్ చేశారు. గ్రోత్ సెంటర్లో పాడైపోయిన రోడ్లను గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లు పాడైపోవడంతో రాకపోకలకు వాహనదారులు, కార్మికులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రోడ్లు పాడైపోతే నూతన పరిశ్రమలు ఏర్పాటుకు పారిశ్రామికవేత్తలు ఎలా ముందుకు వస్తారని ప్రశ్నించారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి పాడైపోయిన రోడ్లు బాగు చేయాలని డిమాండ్ చేశారు.


సమావేశంలో మాట్లాడుతున్న డ్వామా పీడీ ఉమా పరమేశ్వరి

ఫీల్డ్‌అసిస్టెంట్లపై పీడీ ఆగ్రహం

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని ఫీల్డ్‌అసిస్టెంట్ల పనితీరుపై డ్వామా పీడీ ఉమాపరమేశ్వరి ఆగ్రహం వ్యక్తంచేశారు. మండలంలో గతేడాది కాలంలో చేపట్టిన ఉపాధి హామీ పనులపై గురువారం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా సామాజిక తనిఖీ బృందం గ్రామాల్లో చేపట్టిన తనిఖీలకు సంబంధించి నివేదికలను ప్రవేశపెట్టింది. ఈ పరిశీలనలో ఫీల్డ్ అసిస్టెంట్లు నిర్లక్ష్యంగా వ్యవహరించడమే కాకుండా తప్పుడు మస్తర్లు వేసి డబ్బులు చెల్లించడం, ఏ గ్రామంలోనూ వంద రోజులు పని కల్పించక పోవడంపై పీడీ ఆగ్రహం వ్యక్తంచేశారు. గతంలో పనిచేసిన చెరువుల్లో మళ్లీ పనిచేయడంపై మండిపడ్డారు. వేతనదారులకు పేమెంట్లు ఇవ్వడంలో కూడా వ్యత్యాసం ఉన్నట్లు తేలిందని తెలిపారు. ఇటువంటి చర్యలకు పాల్పడిన ఫీల్డ్‌అసిస్టెంట్ల అందరికీ లోపాలు సరిచేసి రికార్డులు అప్పగించేంత వరకు జీతాలు నిలిపివేయాలని ఎపిఒ ఆదిలక్ష్మిని ఆదేశించారు. వేతనదారులకు అవగాహన కల్పించి ప్రతిఒక్కరికి వంద రోజులు పని కల్పించేలా చర్యలు చేపట్టాలని, విధి నిర్వహణలో అశ్రద్ధ వహిస్తే తొలగిస్తామని హెచ్చరించారు. ప్రతి గ్రామంలోనూ పనులను పరిశీలించి, సక్రమంగా జరిగేలా చూడాలని ఎపిఒను పీడీ ఆదేశించారు. కార్యక్రమంలో డివిఇఒ ఎ.వెంకట లక్ష్మీ నాయుడు, అంబుడ్స్‌పర్సన్ అన్నపూర్ణాదేవి, ఎస్.కోట ఎపిఒ ఎస్.శారదా దేవి, జనార్ధనరావు, ఎంపిడిఒ జి.ఉమ, జెడ్‌పిటిసి సేనాపతి అప్పలనాయుడు, డిసిసిబి చైర్మన్ వివి చినరామునాయుడు, ఎఎంసి చైర్‌పర్సన్ ఎం.కస్తూరి పాల్గొన్నారు.

నెల్లిమర్ల నుంచి నేనే పోటీ చేస్తా

ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

ప్రజాశక్తి - భోగాపురం

వచ్చే ఎన్నికల్లో తానే వైసిపి అభ్యర్థిగా పోటీ చేస్తానని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద గురువారం వాలంటీర్లకు వందనం కార్యాక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో మీరే అభ్యర్థులని ఇప్పటికే అధిష్టానం తమకు తెలిపిందన్నారు. ఈ మధ్య సీటు వస్తుందో రాదో కూడా తెలియని నాయకులు నన్ను 30 వేల మెజారిటీతో ఓడిస్తామని చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు. మరొకరు కిందటి ఎన్నికలలో ఘోరంగా ఓడిపోయి అమెరికా పారిపోయి మళ్ళి ఇప్పుడు కనిపిస్తూ తనను ఓడిస్తామని బీరాలు పలుకుతున్నారని విమర్శించారు. ఈ బడ్డుకొండను డీకొట్టడం అంత తేలిక కాదని వారి ఆశలు అడియాసలెనని జోష్యం పలికారు. దేశం మొత్తం మీద లేని వాలంటీర్ వ్యవస్థను ఆంధ్ర రాష్ట్రంలో పెట్టి ప్రతీ గడపకు సంక్షేమ పథకాలు అందిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడు బాబు, వైసిపి మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి, ఎంపిపి అనూష రెడ్డి, జెడ్‌పిటిసి మంజులత, వైస్ ఎంపిపి సత్యవతి, ఎంపిడిఒ చంద్ర కళ, తహశీల్దార్ శ్యాంప్రసాద్, రాష్ట్ర హౌసింగ్ డైరెక్టర్ శివారెడ్డి, నాయకులు పడాల శ్రీనివాసరావు, పడాల భానుప్రకాష్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.


సత్కార సభలో పాల్గొన్న వాలంటీర్లతో ఎమ్మెల్యే అప్పలనాయుడు

'అవంతి'లో విద్యార్థులకు ప్రాంగణ ఎంపికలు

ప్రజాశక్తి- గరివిడి

స్థానిక అవంతీస్ సెయింట్ థెరిస్సా ఇంజనీరింగ్ కాలేజీలో గురువారం బెంగళూరుకు చెందిన ప్రముఖ సాఫ్ట్ వేర్ కంపెనీ 'కోడ్ నెస్ట్ ప్రైవేట్ లిమిటెడ్' ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వి. జాషువా జయ ప్రసాద్ మాట్లాడుతూ ఈ ప్రాంగణ ఎంపికలకు బి.టెక్ అన్ని విభాగాలకు చెందిన విద్యార్థులు అర్హులని తెలిపారు. ఎంపికలకు మన కాలేజీ విద్యార్థులతో పాటు మొత్తం 126 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. ఎంపికలు కోడ్ నెస్ట్ ప్రైవేట్ లిమిటెడ్ హెచ్.ఆర్ టీమ్ రఘుల్, గజేంద్ర సింగ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆన్‌లైన్ పరీక్షలు, బృంద చర్చలు, మౌఖిక పరీక్షలు నిర్వహించి 28 మంది విద్యార్థులను ఎంపిక చేసినట్లు వెల్లడించారు. ఈ ఎంపికైన విద్యార్థులకు కంపెనీ సాఫ్ట్ వేర్ అప్లికేషన్స్, జావా, పైథాన్, ఫుల్ స్టాక్, టెస్టింగ్ టూల్ వంటి తదితర కోర్సుల్లో నాలుగు నెలలు శిక్షణ ఇచ్చి దీనికి అనుబంధంగా ఉన్న అట్రా ఇన్ఫోటెక్, ప్రైమ్ ఫోకస్ టెక్నాలజీస్, సోనాట సాఫ్ట్ వేర్, బైట్ల సాఫ్ట్ వేర్, సింగపూర్ ఇన్ఫోటెక్ వంటి తదితర ఎమ్. ఎన్. సి కంపెనీలలో ఉద్యోగాలు కల్పిస్తామని తెలిపారు.

దేవుపల్లి విఆర్ఒపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-బొండపల్లి

రైతులను ఇబ్బంది పెడుతూ పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వని దేవుపల్లి విఆర్ఒ శివపై అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు తూముల బావాజీ, జామి గురువులు, మామిడి జక్రయ్య, అంజూరు అప్పలసత్యం కోరారు. ఈ మేరకు గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో వారు విలేకర్లతో మాట్లాడారు. దేవుపల్లి రెవెన్యూ పరిధిలోని పలు భూముల విషయమై ఆన్‌లైన్ చేయుటకు మ్యుటేషన్ పెట్టామని, దానిని విఆర్ఒ తిరస్కరించారని తెలిపారు. మ్యుటేషన్ పెట్టిన భూమికి కొంత సొమ్ము విఆర్ఒ డిమాండ్ చేశారని వారు ఆరోపించారు. రైతులు ఇబ్బంది పెడుతున్న విఆర్ఒపై గ్రీవెన్స్‌లో కూడా ఫిర్యాదు చేశామని తెలిపారు.

విఆర్ఒ వివరణ

రైతుల ఆరోపణలను దేవుపల్లి విఆర్ఒ శివ వద్ద ప్రస్తావించగా, అన్ రిజిస్టర్ డాక్యుమెంట్ కావడం వల్ల సదరు రైతు మ్యుటేషన్‌ను తిరస్కరించినట్లు వివరణ ఇచ్చారు.

వేర్వేరుగా తడి, పొడి చెత్త సేకరణ

ప్రజాశక్తి-బొబ్బిలి

మున్సిపాలిటీలో తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని కమిషనర్ ఎల్.రామలక్ష్మి.. సిబ్బందిని ఆదేశించారు. పట్టణంలోని పారిశుధ్య పనులను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటాని హెచ్చరించారు. ఆమెతో పారిశుధ్య విభాగ కార్మికులు ఉన్నారు.